# ఆదర్శం - ఆచరణ

శ్రీమతి డీ. వాణి

ఆ యేడు దసరా సెలవులకు మైసూరు వెళ్ళాను. అక్కడే నా స్నేహితుడు ప్రభాకర్ లెక్చరరుగా పనిచేస్తున్నాడు. నా రాకకెంతో ఆనందించిన ప్రభాకర్ దంపతులు చాల మర్యాద చేశారు. నేను మాత్రం అతని భార్య రాధను చూచి ఆశ్చర్యపడ్డాను. తెల్లగా అందంగా ఉండే ప్రభాకర్ నల్లగా ఉండే రాధ నెట్లా చేసుకున్నాడో ననిపించింది. ప్రభాకర్ పెళ్ళి అయిన క్రొత్తలో నలుగురూ విడ్డూరంగా అనుకున్న మాటలు నన్ను అసలు విషయం తెల్సుకోమని పురిగొల్పాయి.

"సాయంత్రం కాఫీ త్రాగుతూ ఉండగా "రాధ నీక్లాసు మేటా ప్రభాకర్?" అని అడిగాను. ప్రభాకర్ నా భావం అర్థమైనట్లుగా నవ్వాడు.

"నీవడగబోయే ప్రశ్న, నీ ఆశ్చర్యానికి కారణం నాకు తెలుసు శంకర్! రాధ నా క్లాసుమేటు కాదు. ఆదర్శం ఆచరణలో పెట్టబడిందని మాత్రమే సమాధానం యివ్వగలను;" అన్నాడు.

మరునాటి సాయంత్రం యిద్దరం షికారుకి బయలుదేరాం.

"నీకు వివాహావిషయం తెలుసుకోవాలని కుతూహలంగా ఉందికదూ!" అని నవ్వి జరిగిన సంగతులు చెప్పసాగాడు.

♦ ♦ ♦

ప్రభాకర్ ఎమ్. ఏ ఫస్టుక్లాసులో ప్యాసై, లెక్చరరు అయిన రోజులవి. మంచి కుటుంబానికి చెందినవాడూ, చదువుకున్న వాడూ అయినందువల్ల చాల సంబంధాలు రాసాగాయి.

వకీలు పరంధామయ్య ఆ కుటుంబానికి బాగా పరిచితుడు. అతని స్నేహితుడు శ్రీరాం కూతురు రాధ. శ్రీరాం మధ్యతరగతి సంసారి. ఇద్దరు కూతుళ్ళకు శ్రమపడి పెళ్ళిళ్లు చేశాడు. ఆఖరి కూతురు రాధ. ఆమె యింటరు ప్యాసై ఆర్థికపరిస్థితులు బాగులేక కాలేజీ మానేసింది. వీణ చక్కగా వాయించడమే కాక మధురంగా పాడుతుంది. కాస్త నల్లగా ఉన్నా కళలుచిందే ముఖంతో చక్కగా ఉంటుంది. గుణవంతురాలు. అటువంటి రాధను చూడవలసిందని పరంధామయ్య ప్రభాకర్‌ను కోరాడు.

మంచి ముహూర్తం చూసుకొని ప్రభాకర్, తండ్రి వెళ్ళారు. శ్రీరాం బాగా మర్యాదచేశాడు. రాధను తీసుకొచ్చారు. వీణ వాయించింది. పూర్వకళ్యాణి రాగపు కృతి "పరమపావనరామా" మధురంగా పాడింది. ఆమె కంఠ మాధుర్యం ప్రభాకర్ నేవో లోకాలకు తీసుకుపోయింది. కొంతసేపటికి వెళ్ళిపోయారు.

♦ ♦ ♦

'అమ్మాయి నల్లగా ఉంది. అదీకాక వాళ్లు మన హోదాకి తగరు;' తండ్రి తేలిగ్గా తేల్చేశాడు.

'అయితే లాభంలేదు. పరంధామయ్య మాటలు నమ్మి వారింటికి వెళ్ళడం మర్యాదకి భంగం' అని తల్లి యీసడించింది. వారిమాటలు విన్నాక ప్రభాకర్ మనస్సుకూడ ఒకవిధంగా మారిపోయింది. తను అందగాడు, మంచి చదువు చదివి హోదాలో ఉన్నవాడు కాబట్టి గొప్పయింటి సంబంధమే చేసుకోవాలనిపించింది. పూర్వపు మంచి తనపు ఉత్తమాదర్శాల స్థానాన్ని గర్వం ఆక్రమించుకుంది.

ప్రభాకర్ నించి యే సమాధానమూ రాకపోయేసరికి శ్రీరాం నిరాశచెందాడు.

పరంధామయ్య అసలు విషయం కనుక్కుందామని వెళ్ళాడు.

'అమ్మాయి బాగుండదు. అందుచేత ప్రభాకర్

యిష్టపడలేదు;' అన్నాడు తండ్రి. ప్రభాకర్ మంచి ఆదర్శాలుగల యువకుడని విన్న పరంధామయ్య నిర్ఘాంతపోయాడు.

'రాధకేం లోటు! మంచికుటుంబంలోంచి వచ్చిన పిల్ల. చదువూ, సంగీతం ఉంది. అయినా సుఖమయ జీవితానికి నలుపూ, తెలుపూ యేవిధంగానూ తోడ్పడవు కదూ!' అన్నాడు. పరంధామయ్య మాటలు యథార్థాలవడంవలన ప్రభాకర్ తండ్రి కొంతసేపటి వరకూ సమాధానం చెప్పలేకపోయాడు.

'అమ్మాయి యిష్టపడనప్పుడు యిక యెన్ని చెప్పినా లాభంలేదు కదూ' అని ఆ ప్రసంగాన్ని అంతటితో త్రుంచేశాడు. పరంధామయ్య చాల బాధపడ్డాడు. కేవలం స్టేజియొక్క ఉపన్యాసాలిచ్చేవరకే ఆదర్శాలని, వాస్తవిక జీవితంలో కార్యశూన్యాలని గ్రహించాడు. ఇంతవరకు యెన్నో వివాహాలకు మధ్యవర్తిగా ఉండి ఘనంగా జరిపించిన పరంధామయ్య అవమానం జరిగినట్లు ఫీలయాడు. కాని శ్రీరాంతో యేమీ చెప్పలేదు.

◆ ◆ ◆

సాయంత్రం ఆరైంది. క్లబ్బులో మెంబర్లు చాల మంది కాలక్షేపానికి వచ్చారు. కొందరు టేబిల్ టెన్నిసు, బాడ్మింటన్ మొదలైన ఆటల్లో పడ్డారు. మరికొందరు పత్రికలు చదువుకోసాగారు. పరంధామయ్య, ప్రభాకర్ మరికొందరు మెంబర్లు అప్రయత్నంగా ఒక టేబిలువద్ద కలిశారు. రాజకీయాలతో ప్రారంభమైన సంభాషణ యెన్నో విషయాలవైపు మళ్లింది.

'అమెరికనులు నీగ్రోలను నల్లవాళ్ళంటూ బాధపెట్టడం. బ్రిటిషువారు ఇండియన్లను ఆవిధంగానే హేళన చేస్తూ కష్టాలపాలు చేయడం తల్చుకుంటే బాధగా ఉంటుంది. ఆవిధంగా చేయడంలో వారికి లభించే దేమిటో నాకు అర్థంకాదు,' అన్నాడు పరంధామయ్య.

'విద్యావిజ్ఞానాల్లో యెంత గొప్పవారైనా తోటి మానవుల నాదరించడంలో మటుకు సంస్కారాన్ని చాటుకోలేకపోయారు,' అన్నాడొక వ్యక్తి.

'అవును! తోటివారు కష్టాల్లో ఉన్నప్పుడు కేవలం రంగు విబేధంతో నిరాదరణ చేయడం మానవత్వమనిపించుకోదు,' అన్నాడు ప్రభాకర్.

'అయితే రంగువిబేధాన్ని పాటించకూడదంటావా ప్రభాకర్?' పరంధామయ్య ప్రభాకర్ని పరిశీలనగా చూస్తూ అడిగాడు.

'ఒక్కనాటికి రంగుని, బాహ్యాడంబరాన్ని లక్ష్య పెట్టరాదు,' అన్నాడు ప్రభాకర్ ఆవేశంతో.

"నీ అభిప్రాయం అమూల్యమైనది ప్రభాకర్! ఇతరదేశాలవారు నల్లనివారిని నిరాదరణ చేశారని బాధపడుతున్నాం. కాని యీ రోజుల్లో మన దేశంలోనే రంగుని, బాహ్యాడంబరాన్ని ముఖ్యంగా పరిగణించి అమృతహృదయాలని సహితం తిరస్కరిస్తున్నారంటే ఆశ్చర్యపడతావేమో?" అన్నాడు.

"పరస్పరమైన ఆత్మీయతయందు పైమెరుగులకే మాత్రమూ ప్రాముఖ్యత నీయకూడదు. అట్లాయివ్వటం మూర్ఖతే అవుతుంది." అన్నాడు ప్రభాకర్ తన వ్యక్తిగత జీవితం గురించి మర్చిపోయి, కాలేజీలో చదివేటప్పటి ఆదర్శాలు పూర్తిగా వప్పగించేశాడు.

"నీ ఆదర్శాలు ఉత్తమమైనవి ప్రభాకర్! అందరూ నీలాగే యీ ఆదర్శాలను దృష్టిలో పెట్టుకొని ఆచరణలో పెట్టగల్గితే దేశం బాగుపడుతుంది" పరంధామయ్య సూటిగా బాణం వదిలాడు. చటుక్కున ప్రభాకర్ తేరుకున్నాడు. ముఖం వివర్ణమైంది. వ్యక్తిగత జీవితంపై పరంధామయ్య మాటలు ఎంతటి ప్రభావాన్ని చూపాయోనని ఆశ్చర్యపోయాడు. మొదట కోపం వచ్చినా పరంధామయ్య మాటల్లో సత్యం ఉందని తోచింది. మౌనంగా ఉండిపోయాడు, కొంతసేపయాక "వెళ్ళివస్తాను." అని గబగబా వెళ్ళిపోయాడు. ఇదంతా గమనించిన పరంధా

మయ్య తన పథకం ఫలిస్తున్నట్లు గుర్తించి లోలోపలే నవ్వుకున్నాడు.

◆ ◆ ◆

పరంధామయ్య మాటలు ప్రభాకర్‌ని వెన్నాడుతూనే ఉన్నాయి. ఆతని మాటలు నిజమని, తనది తప్పనితోచేది. తను రాధను చూచినప్పుడు ఆమె కళ్ళల్లో వ్యక్తమైన ఆవేదన గుర్తు వచ్చేసరికి బాధ కలిగేది. ఆమె వివాహం కోసం వారెంత కష్టపడుతున్నారో అనిపించేది. రాధలో యేంలోటున్నదని తిరస్కరించాడు తను! నల్లనిదైనా తీరైనముఖంకలిగిన రాధ, తన కాలేజీ ప్రిన్సిపాల్ చేతకూడ గుణవంతురాలని ప్రశంసించబడిన రాధ. ఎన్నదగిన వ్యక్తి కాదూ! ఆమె మధురగానం తనను దివ్యలోకాలకు తీసుకపోలేదూ! అటువంటి రాధముందు ధనంవిలువ పొజిషన్ ప్రాముఖ్యత యేపాటివి? నిజంగా, ఉత్తమురాలైన రాధను భార్యగా పొందగలగడం యెంత అదృష్టం! పరంధామయ్య నిష్కల్మషమైన వ్యక్తి కాబట్టే తనకు నిజాన్ని సూటిగా తెలిపాడు! ప్రభాకర్ ఆలోచనలీవిధంగా ఉండేవి. చివరకు రాధనే చేసుకోవాలనే నిశ్చయానికి వచ్చాడు.

ఆ రోజు కాలేజీనించి అప్పుడే వచ్చిన ప్రభాకర్‌కి కాఫీ యిస్తూ, "జడ్జీగారి అమ్మాయిని చూడటానికి రేపు వెళ్దాం ప్రభాకర్! ఆ అమ్మాయి అందంగా ఉంటుందిట. వాళ్లు మన హోదాకి తగినవాళ్లు;" అన్నది హుందాగా తల్లి. ప్రభాకర్ కొంతసేపు మౌనంగా ఉండిపోయాడు,

కాఫీ కప్పు తీసుకుని వెళ్లే తల్లిని, 'అమ్మా!' అని పిలిచాడు.

"ఏమిటి బాబూ?" అన్నది వాత్సల్యంగా కొడుకు వైపు చూస్తూ.

"నేను శ్రీరాంగారి రాధను చేసుకుంటానమ్మా!" అన్నాడు.

"వారు మనకి తగరని. అమ్మాయి నల్లగా ఉంటుందని తెలిసి యింకా ఆ ప్రసక్తి యెందుకు?" అన్నది.

"డబ్బూ, హోదా ఒక్కనాటికి ముఖ్యం కావమ్మా! మంచి హృదయంకంటె కోరదగినదేమీ లేదు" అన్నాడు. ప్రభాకర్ మనసులోని అభిప్రాయాన్ని గ్రహించిన తల్లి అతన్ని బాధపెట్టడం యిష్టంలేక, 'నీ సౌఖ్యంకంటె మాకు కావలసిందేమీ లేదు ప్రభాకర్! తప్పకుండా రాధనే చేసుకో!' అన్నది. తండ్రికూడ అడ్డుచెప్పలేకపోయాడు.

◆ ◆ ◆

వారం రోజుల తరువాత ఒకనాటి ఉదయం తన యింట్లో అడుగుపెట్టిన ప్రభాకర్‌ని చూచి పరంధామయ్య ఆశ్చర్యపడలేదు. తన ప్రయత్నంమీద అతనికి నమ్మకం ఉంది.

"రా నాయనా! కూర్చో," సాదరంగా ఆహ్వానించాడు.

"నేను రాధను పెళ్ళిచేసుకుంటాను. ఆశీర్వదించండి" అని నమస్కరించాడు. పరంధామయ్య సంతృప్తిగా చిరునవ్వు నవ్వాడు.

"శుభం నాయనా! నీ అభిప్రాయాల్ని ఆచరణలో పెడుతున్నందుకు చాల సంతోషంగా ఉంది. ఉత్తమురాలైన రాధతో నీ జీవితం మధురంగా ఉంటుంది," అన్నాడు.

తేలికపడిన హృదయంతో ప్రభాకర్ యింటికి వెళ్ళిపోయాడు.

శుభముహూర్తంలో రాధా ప్రభాకర్‌ల వివాహం జరిగిపోయింది.

◆ ◆ ◆

ప్రభాకర్ మాటలు నాకు చాల ఆనందాన్ని కలిగించాయి.

"రాధ నా దేవత, మా యింట్లో అందరికీ రాధంటే ప్రాణం. నేను అదృష్టవంతుడివి" అన్నాడు ప్రభాకర్.

చీకటి పడటంవలన యింటికి బయల్దేరాం. వెళ్లేసరికి అత్తగారి యెదురుగా కూర్చుని రాధ వీణ వాయిస్తూంది. ఆమె నిర్మలవదనంలోని కాంతిని మొదటి సారిగా గుర్తించిన నేను ప్రభాకర్ మాటలు నిజమనుకుంటూ మేడ మీదకు వెళ్ళిపోయాను.

—o—